# జోనా పాంచ్ పటాకా

అంతర్‌జిల్లాల స్విమ్మింగ్ చాంపియన్‌షిప్



హైదరాబాద్, ఆట ప్రతినిధి: సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసీ పూల్ వేదికగా జరుగుతున్న 8వ జూనియర్, సబ్‌జూనియర్ అంతర్‌జిల్లాల చాంపియన్‌షిప్‌లో యువ స్విమ్మర్ జోనా షిజు ఐదు పసిడిపతకాలతో మెరిసింది. ప్రత్యర్థులకు దీటైన పోటీనిస్తూ ముందుకు సాగిన జోనా వేర్వేరు విభాగాల్లో పతకాలు సొంతం చేసుకుంది. ప్రస్తుతం ఆరో తరగతి చదువుతున్న జోనా..బాలికల 50మీ, 100మీ, 200మీ ఫ్రీ స్టయిల్, 50మీ, 100మీ బ్రెస్ట్‌స్ట్రోక్ ఈవెంట్లలో అగ్రస్థానంలో నిలిచి ఆకట్టుకుంది.

# పాయల్, నిషా, ఆకాంక్ష పసిడి జోష్



న్యూఢిల్లీ: ఐబీఏ జూనియర్ ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత మహిళా బాక్సర్లు పాయల్, నిషా, అకాంక్ష సత్తాచాటారు. మంగళవారం చివరి రోజు ఇండియాకు మూడు స్వర్ణాలు సాధించిపెట్టి మహిళల జట్టును సంయుక్తంగా రెండో స్థానంలో నిలబెట్టారు. అర్మీనియాలోని ఎరెవాన్‌లో జరిగిన ఈ టోర్నీలో భారత జట్టు మొత్తంగా మూడు స్వర్ణాలు, తొమ్మిది రజతాలు, అయిదు కాంస్యాలు సాధించింది. బాలికల 48 కిలోల విభాగంలో పాయల్ భారత్‌కు తొలి స్వర్ణం అందించింది. ఫైనల్లో పాయల్ స్థానిక బాక్సర్ పెట్రోస్యన్ హెజిన్‌ను చిత్తుగా ఓడించింది. అనంతరం ఆసియా యూత్ చాంపియన్లు నిషా, ఆకాంక్ష అంచనాల మేరకు రాణించి మరో రెండు స్వర్ణాలు సాధించారు. 52 కిలోల విభాగంలో నిషా తజకిస్తాన్‌కు చెందిన అబ్దులయెవ ఫిరనోజ్‌పై, 70 కిలోల విభాగంలో ఆకాంక్ష రష్యాకు చెందిన తైమజొవ ఎలిజవెతపై 5-0 స్కోరుతో విజయం సాధించి విజేతలుగా నిలిచారు. చివరిరోజు మరో ముగ్గురు మహిళా బాక్సర్లు విని (57కి.), సృష్టి (63కి.), మేఘ (80కి.) ఫైనల్లో పరాజయంపాలై రజతాలతో సంతృప్తి చెందారు. పురుషుల విభాగంలో సాహిల్ (75కి.), హేమంత్ (80ప్లస్ కి.) ఫైనల్స్‌లో 1-4 తేడాతో పరాజయంపాలై రజతాలతో సంతృప్తి చెందారు.

# అర్జీత్ హ్యాట్రిక్‌తో భారత్ బోణీ



కౌలాలంపూర్ : మంగళవారం ప్రారంభమైన ఎఫ్‌ఐహెచ్ జూనియర్ పురుషుల హాకీ ప్రపంచకప్‌లో భారత్ ఘనమైన బోణీ చేసింది. పూల్-సిలో కొరియాతో జరిగిన తొలి మ్యాచ్‌లో అర్జీత్ సింగ్ హుందాల్ చేసిన హ్యాట్రిక్‌తో భారత జట్టు 4-2 తేడాతో గెలుపొందింది. అర్జీత్ సింగ్ 11, 16, 41 నిమిషాలలో గోల్స్ సాధించి ఆరంభం అందించాడు. అమన్‌దీప్ 30వ నిమిషంలో మరో గోల్‌తో విజయంలో పాలుపంచుకున్నాడు. కొరియా జట్టులో 38నిమిషంలో దోహ్యున్ లిమ్, 45వ నిమిషంలో మినోన్ కిమ్ గోల్స్ చేసి అంతరం తగ్గించారు. 2021లో భువనేశ్వర్‌లో జరిగిన గత టోర్నీలో కాంస్య పతక పోరులో ఫ్రాన్స్ చేతిలో ఓడిన భారత్ ఈసారి తొలి మ్యాచ్‌లో అదరగొట్టింది. తొలి క్వార్టర్‌లోనే పెనాల్టీకార్నర్‌ను అర్జీత్ గోల్‌గా మలచి శుభారంభం అందించాడు. అదే జోరు కొనసాగిస్తూ రెండో క్వార్టర్‌లో అర్జీత్, అమనదీప్ ఫీల్డ్ గోల్స్ సాధించి విరామానికి భారత్‌ను 3-0తో తిరుగులేని ఆధిక్యంలో నిలిపారు. మూడో క్వార్టర్‌లో కొరియా తొలి గోల్‌తో అంతరాన్ని తగ్గించినా అర్జీత్ ఫీల్డ్ గోల్‌తో మళ్లీ ఆధిక్యం పెంచాడు. తరువాత భారత జట్టు పట్టు సడలించడంతో కొరియా మరో గోల్ చేసింది. ఆపై ఇరు జట్లు మరో గోల్ చేయడంలో విఫలమయ్యాయి.

# అశ్విని-తనీష@28



న్యూఢిల్లీ : భారత మహిళా డబుల్స్ షట్లర్స్ అశ్విని పొన్నప్ప, తనీష క్రాస్టో బిడబ్ల్యుఎఫ్ తాజా ర్యాంకింగ్స్‌లో నాలుగు స్థానాలు మెరుగై 28వ ర్యాంక్‌కు చేరుకున్నారు. 36 ఏళ్ల అశ్విని, 20 ఏళ్ల తనీష ఈ యేడాది జనవరినుంచి డబుల్స్ విభాగంలో భాగస్వాములుగా ఆడుతున్నారు. ఇటీవల ముగిసిన సయ్యద్ మోదీ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ టోర్నీలో రన్నరప్‌గా నిలిచారు. అంతకుముందు నేట్స్ ఇంటర్నేషనల్ చాలెంజ్ టోర్నీ, అబుదాబి మాస్టర్స్ సూపర్-100 టోర్నీలను గెలుచుకున్నారు. కాగా ఇతర భారత ఆటగాళ్లు తమ ర్యాంకింగ్‌లలోనే కొనసాగుతున్నారు. హెచ్‌ఎస్ ప్రణయ్ 8, లక్ష్య సేన్ 17, కిడాంబి శ్రీకాంత్ 24, పివి సింధు 12, సాత్విక్-చిరాగ్ 2, త్రిషా జాలి-గాయత్రి గోపిచంద్ 19 ర్యాంక్‌లలో నిలిచారు.



భారత యువ క్రికెటర్ చేతన్ సకారియా త్వరలో ఓ ఇంటివాడు కాబోతున్నాడు. కుటుంబసభ్యులు, స్నేహితుల సమక్షంలో మంగళవారం చేతన్ వివాహ నిశ్చితార్థ వేడుక జరిగింది.

# గుజరాత్ హ్యాట్రిక్

ప్రొ కబడ్డీ లీగ్



అహ్మదాబాద్: ప్రొ కబడ్డీ లీగ్(పీకేఎల్)లో గుజరాత్ జెయింట్స్ వరుస విజయాల జోరు కొనసాగుతున్నది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ 39-37 తేడాతో యూ ముంబైపై అద్భుత విజయం సాధించింది. యువ రైడర్ సోను జగ్లాన్ 11 పాయింట్లతో గుజరాత్ విజయంలో కీలకంగా వ్యవహరించాడు. కెప్టెన్‌గా వందో మ్యాచ్ ఆడుతున్న ఫజల్ అత్రాచలీ ఐదు పాయింట్లతో ఆకట్టుకోగా, రాకేశ్ 9 పాయింట్లు ఖాతాలో వేసుకున్నాడు. మరోవైపు ముంబా తరపున గుమన్ సింగ్ (10), జఫర్‌దనేశ్ (10) రాణించినా..జట్టును గెలిపించలేకపోయారు.

## రాజీనామా రచ్చ

# దాదా X కోహ్లీ



**తాను తొలిగించలేదన్న సౌరవ్ గంగూలీ • దాదాగిరీ అన్‌లిమిటెడ్ షో లో వ్యాఖ్య**

న్యూఢిల్లీ : విరాట్ కోహ్లీ కెప్టెన్సీ నుంచి తప్పుకోవడంపై మళ్లీ వివాదం చెలరేగింది. జీ న్యూస్ ప్రత్యేక కార్యక్రమం 'దాదాగిరి అన్‌లిమిటెడ్' పదో సీజన్‌లో బీసీసీఐ మాజీ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీతో జరిపిన చర్చలో కోహ్లీని తాను కెప్టెన్సీనుంచి తప్పించలేదని పేర్కొన్నాడు. ఈ విషయాన్ని పలుమార్లు స్పష్టీకరించినట్టు తెలిపాడు. 2021 టీ20 ప్రపంచకప్‌లో వైఫల్యానికి బాధ్యత వహిస్తూ కోహ్లీ కెప్టెన్సీ నుంచి తప్పుకున్నాడని చెప్పాడు. వాస్తవానికి తాను టీ20 కెప్టెన్‌గా కొనసాగాలని కోహ్లీని ప్రత్యేకంగా కోరానని, అయినా అందుకు సుముఖత వ్యక్తం చేయలేదన్నాడు. ఒకవేళ నిర్ణయం మార్చుకోకుంటే పరిమిత ఓవర్ల ఫార్మాట్ నుంచి కెప్టెన్సీ వదులుకుంటే అపుడు తెల్లబంతి క్రికెట్‌కు ఒకరు, ఎర్రబంతి క్రికెట్‌కు ఒకరు కెప్టెన్‌గా ఉంటారని వివరించానన్నాడు. ఆ సమయంలో మూడు ఫార్మాట్లలో సారథ్యం వహించేందుకు రోహిత్‌శర్మ సిద్ధంగా లేడని దాదా తెలిపాడు. కోహ్లీ తన నిర్ణయాన్ని మార్చుకోకపోవడంతో రోహిత్‌ను తానే ఒప్పించానన్నాడు. మూడు ఫార్మాట్లలో కెప్టెన్సీ వహించడం ఎవరికైనా కష్టమేనని, అది వారి ప్రదర్శనపై ప్రభావం చూపుతుందన్నాడు. నాటి పరిణామాలతో ఎవరిని కెప్టెన్‌గా చేయాలన్న సెలెక్షన్ కమిటీ నిర్ణయంలో తాను జోక్యం చేసుకోలేదన్నాడు. బోర్డు అధ్యక్షుడిగా భారత క్రికెట్ ఉన్నతికి తనవంతు కృషి చేశానని సౌరవ్ అన్నాడు. కోహ్లీ టీ20 కెప్టెన్సీనుంచి తప్పుకోవడంతో తెల్ల బంతి ఫార్మాట్‌కు ఇద్దరు కెప్టెన్లు ఉండడం మంచిది కాదనే భావనతో రోహిత్‌కు పగ్గాలు ఇవ్వడం జరిగిందని సౌరవ్ వివరించాడు.

**కోహ్లీ మాట మారుస్తున్నాడా..చేతన్‌శర్మ**

కోహ్లీ కెప్టెన్సీ నుంచి తప్పుకుంటానన్నప్పుడు కొంతకాలం కొనసాగాలని సౌరవ్ కోరినట్టు అప్పటి చీఫ్ సెలెక్టర్ చేతన్ శర్మ తెలిపాడు. 2021 డిసెంబర్‌లో సౌరవ్-కోహ్లీ మధ్య స్పర్ధపై మాట్లాడుతూ గంగూలీ అభ్యర్థనను కాదన్న కోహ్లీ తర్వాత తనను కెప్టెన్‌గా కొనసాగాలని బోర్డు కోరలేదని చెప్పడం తనను ఆశ్చర్యపరిచిందన్నాడు. కోహ్లీ ఎందుకో నిజాన్ని దాస్తున్నాడని, దీనిపై అతడే వివరణ ఇవ్వాలన్నాడు. ఒక ఆటగాడు తన అభిమతానికి ప్రాధాన్యం ఇస్తూ బోర్డు అధ్యక్షుడిని బాధ్యుడిని చేయడం తగదన్నాడు. అది బోర్డుకు, ఆటగాళ్లకు మధ్య దూరం పెంచుతుందన్నాడు. ఎవరిది తప్పు, ఎవరిది ఒప్పు అన్నది పక్కనబెడితే ఇటువంటి విషయాలలో గోప్యత అవసరమన్నాడు. ఎందరో గొప్ప ఆటగాళ్లు వచ్చారు, వెళ్లారని.. క్రికెట్ మాత్రం తన ఉనికిని కాపాడుకుంటుందని అన్నాడు. ఎవరైనా ఆటగాడు తాను ఆట కంటే గొప్పవాడని భావిస్తే అది వివాదాలకు దారితీస్తుందన్నాడు.

**బోర్డు పట్టించుకోలేదు: కోహ్లీ**

తన రాజీనామాపై బోర్డు పట్టించుకోలేదని, తాను టీ20 కెప్టెన్సీని వదులుకుంటానని తెలిపినపుడు కొనసాగాలని ఎవరూ చెప్పలేదని గతంలో కోహ్లీ ఒక సందర్భంగా తెలిపాడు. బోర్డు నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో తాను ముందుగా టీ20 కెప్టెన్సీని వదులుకున్నానని, తనపై ఒత్తిడి పెరుగుతుండడంతో క్రమంగా వన్డేలకు, టెస్టు కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకున్నానని తెలిపాడు. సారథిగా ఉన్న సమయంలో కోచ్ రవిశాస్త్రి, సహాయ సిబ్బంది, సహచరులు అందించిన సహకారం మరువలేనిదన్నాడు. అంతేగాక తన ఆరాధ్య క్రికెటర్, మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ కొన్ని సందర్భాలలో వారసుడిగా తనను సూచించాడని గుర్తుచేసుకున్నాడు.

# ఇక అమ్మాయిల సమరం

**నేడు భారత్, ఇంగ్లండ్ తొలి టీ20 • రాత్రి 7 నుంచి స్పోర్ట్స్-18లో**

**ఐపీఎల్, ఆసియాకప్, వన్డే ప్రపంచకప్, ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్.. ఇలా వరుసగా భారత పురుషుల క్రికెట్ జట్టు ప్రదర్శనలను ఆస్వాదించిన అభిమానులకు.. ఈ రోజు నుంచి అమ్మాయిలు క్రికెట్ అలరించనుంది. ఇంగ్లండ్ మహిళల జట్టుతో హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు సిద్ధమైంది. బుధవారం వాంఖడే వేదికగా తొలిపోరు జరుగనుండగా.. ఆసియా చాంపియన్స్‌గా మైదానంలో అడుగుపెడుతున్న మన అమ్మాయిలు ఇంగ్లిష్ టీమ్‌పై ఆధిపత్యం కనబర్చాలని చూస్తున్నారు!**



ముంబై: ఆసియా క్రీడల్లో స్వర్ణం నెగ్గి చరిత్ర సృష్టించిన భారత మహిళల క్రికెట్ జట్టు.. మరో అంతర్జాతీయ సిరీస్‌కు సిద్ధమైంది. హర్మన్‌ప్రీత్ సారథ్యంలోని భారత జట్టు ఇంగ్లండ్‌తో మూడు టీ20లు, ఒక టెస్టు మ్యాచ్ ఆడేందుకు రెడీ అయింది. పొట్టి సిరీస్‌లో భాగంగా బుధవారం వాంఖడే వేదికగా తొలి టీ20 జరగనుంది. టీ20 ఫార్మాట్‌లో జరిగిన ఆసియాకప్‌లో భారత్ అద్వితీయమైన ప్రదర్శన కనబర్చడంతో పాటు అంతకుముందు బంగ్లాదేశ్‌పై 2-1తో సిరీస్ కైవసం చేసుకొని మంచి జోరు మీద ఉంది. మరోవైపు టీ20ల్లో ప్రపంచ రెండో ర్యాంక్‌లో ఉన్న ఇంగ్లండ్.. భారత్‌ను భారత్‌లో ఓడించి సిరీస్ కైవసం చేసుకోవాలని చూస్తున్నది. ర్యాకింగ్స్‌లో నాలుగో స్థానంలో ఉన్న టీమ్‌ఇండియాకు స్వదేశంలో ఇంగ్లిష్ జట్టుపై మంచి రికార్డు లేదు. ఇప్పటి వరకు ఇంగ్లండ్‌తో 9 మ్యాచ్‌లు ఆడిన భారత్ రెండింట మాత్రమే గెలిచింది. ఓవరాల్‌గానూ మన అమ్మాయిల గణాంకాలు అంత గొప్పగా ఏం లేవు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌తో పాటు స్మృతి మంధన, రిచా ఘోష్, జెమీమా రోడ్రిగ్స్, షఫాలీ వర్మ, దీప్తి, రేణుక సమిష్టిగా రాణించాలని టీమ్ మేనేజ్‌మెంట్ ఆశిస్తున్నది. ఇక ఇటీవలే మహిళల కోచ్‌గా ఎంపికైన రంజీ దిగ్గజం అమోల్ మజుందార్ జట్టును ఎలా తీర్చిదిద్దుతాడనేది ఆసక్తికరం. ఇతర అంతర్జాతీయ జట్లతో పోల్చుకుంటే.. ఫీల్డింగ్, ఫిట్‌నెస్ అంశంలో మన అమ్మాయిలు వెనుకబడి ఉండటంపై దృష్టి పెట్టనున్నట్లు మజుందార్ వెల్లడించాడు. 'నాణ్యమైన క్రికెట్ ఆడటమే మా లక్ష్యం. భయం లేకుండా ముందుకు సాగుతాం. ఫీల్డింగ్, ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టాం. షఫాలీ, జెమీమా వంటి వాళ్లు ఎంతో ముఖ్యం. వచ్చే ఏడాది జరుగనున్న ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకొని జట్టును తీర్చిదిద్దుతాం. ఆ క్రమంలో ప్రతీ సిరీస్ ముఖ్యమైనదే' అని మజుందార్ అన్నాడు. మరోవైపు హీతర్ నైట్, అమీ జోన్స్, స్కీవర్ బ్రంట్, డానీ వ్యాట్, సోఫియా ఎకెల్‌స్టోన్, సారా వంటి ప్రతిభావంతులతో ఇంగ్లండ్ పటిష్టంగా ఉంది.

# పాకిస్థాన్‌దే టీ20 సిరీస్



డ్యునెడిన్: న్యూజిలాండ్ మహిళల జట్టుతో జరిగిన టీ20 సిరీస్‌ను గెలుచుకుని పాకిస్థాన్ మహిళల జట్టు చరిత్ర సృష్టించింది. పాకిస్థాన్ మహిళలకు కివీస్‌ను వారి దేశంలో ఓడించడం ఇదే ప్రథమం. మంగళవారం జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో పాకిస్థాన్ జట్టు 10 పరుగుల తేడాతో గెలుపొందింది. తొలి మ్యాచ్‌ను 7 వికెట్ల తేడాతో గెలుచుకున్న పాకిస్థాన్ మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకుంది. తొలుత పాక్ నిర్ణీత ఓవర్లలో 6 వికెట్లకు 137 పరుగులు చేసింది. మునీబా అలీ 35, అలియా రియాజ్ 32నాటౌట్, మరూఫ్ 21 పరుగులతో రాణించారు. ఫ్రాన్ జొనాస్, మోలి పెన్‌ఫోల్డ్ చెరి రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం న్యూజిలాండ్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 127 పరుగులు మాత్రమే చేసి ఓడిపోయింది. హన్నా రో అత్యధికంగా 33 పరుగులు చేయగా, జార్జియా పిల్మర్ 28 పరుగులు చేసింది. ఫాతిమా సన 3, సాదియా ఇక్బాల్ 2 వికెట్లు కూల్చారు. ఇక నామమాత్రమైన మూడో టీ20 మ్యాచ్ శనివారం జరుగుతుంది.

## 11న మెడికల్ కౌన్సిల్ ఓట్ల లెక్కింపు

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): ఈ నెల 11న తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ (టీఎస్‌ఎంసీ) ఎన్నికల ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. కోఠి డీఎంఈ భవనంలో ఉన్న కాన్ఫరెన్స్ హాలులో ఉదయం 10:30 గంటల నుంచి లెక్కింపు ప్రారంభమవుతుందని అధికారులు తెలిపారు. ఈ ఎన్నికల్లో 96 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. రాష్ట్రంలో 48,405 మంది డాక్టర్లు టీఎస్‌ఎంసీలో నమోదై ఉన్నారు. వీరిలో 17,009 మంది డాక్టర్లు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మెడికల్ కౌన్సిల్‌లో 25 మంది డాక్టర్లు సభ్యులుగా ఉంటారు. ఇందులో 12 మందిని ప్రభుత్వం నామినేట్ చేస్తుంది. మిగతా 13 మందిని సభ్యులు ఎన్నుకుంటారు. వీరు సీక్రెట్ ఓటింగ్ ద్వారా చైర్మన్‌ను ఎన్నుకుంటారు.

## 22, 23న జేఎన్టీయూ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): జేఎన్టీయూహెచ్ క్యాంపస్‌లో ఈ నెల 22, 23 తేదీల్లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించనున్నారు. గ్లోబల్ అలుమ్ని పేరుతో నిర్వహించనున్న ఈ కార్యక్రమ ఏర్పాట్లపై జేఎన్టీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కట్టా నరసింహారెడ్డి సమీక్ష నిర్వహించారు. సమావేశంలో మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి, రిటైర్డ్ ఐఎఫ్‌ఎస్ ఏ సుధాకర్, ఏ నరేంద్రరెడ్డి, జనప్రియ అధినేత రవీందర్‌రెడ్డి, నంద్యాల నర్సింహారెడ్డి, ప్రగతి రిసార్ట్స్‌కి చెందిన బాల కోటేశ్వరరావు, మాజీ వీసీలు, ప్రొఫెసర్లు పాల్గొని పలు అంశాలపై చర్చించారు. గ్లోబల్ అలుమ్నికి అన్ని ప్రాంతాల నుంచి దాదాపు 1,600 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యే అవకాశం ఉన్నదని భావిస్తున్నారు. యూనివర్సిటీ పూర్వవిద్యార్థుల్లో మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డితోపాటు పలువురు ప్రముఖులు ఉన్నారు.

## సారవంతమైన నేలతోనే మానవాళి భవిష్యత్తు

- **వైస్ చాన్స్‌లర్ డాక్టర్ బీ నీరజాప్రభాకర్**

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): సారవంతమైన నేలపైనే మానవాళి భవిష్యత్తు ఆధారపడి ఉన్నదని, భవిష్యత్తు తరాలకు మనం ఇవ్వగలిగే అపురూప కానుక అదేనని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ బీ నీరజాప్రభాకర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మృత్తిక దినోత్సవాన్ని పురస్కరించుకొని లిబర్టీ ఫౌండేషన్, ఉద్యాన విశ్వవిద్యాలయం సంయుక్తంగా ఏర్పాటు చేసిన 'అగ్రిఫుడ్ టెక్ 360' సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మోతాదుకు మించి సహజ వనరుల వాడకం, పారిశ్రామికీకరణ, యాంత్రీకరణ పర్యావరణ క్షీణతకు కారణం అవుతున్నట్టు చెప్పారు. సదస్సులో నాగార్జున గ్రూప్ చైర్మన్ కేఎస్ రాజు, అగ్రి ఫుడ్‌టెక్, రూరల్ ఇంపాక్ట్, మెంటార్ డాక్టర్ రవిశంకర్, కోరమాండల్ ఫర్టిలైజర్ వైస్ ప్రెసిడెంట్ జీవీ సుబ్బారెడ్డి ప్రసంగించారు.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.